భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# వికృత క్రీడ

సిహెచ్వి బృందావనరావు

సాయంత్రం నాలుగ్గంటలు దాటింది. పడమటి దిక్కున నల్లగా మబ్బులు మసురుకున్నాయి. ఎక్కణ్ణించి వచ్చాయో తూనీగలు ఎగుర్తున్నాయి. ఓబులేశు ఇంటిముందు రెండు గిన్నెకోళ్ళు ఆకాశం వైపుచూసి, రెక్కలల్లార్చి, క్రేంకారం చేసి ఎగర బట్టాయి. తలకు చుట్టుకున్న కండువా తీసి ముఖం తుడుచుకుని దాన్ని భుజం మీద వేసుకున్నాడు ఓబులేశు. ఆకాశం వైపు చూసి 'ఈ ఏడు అదున్లోనే వానలు కురిసేట్టున్నాయి' అనుకున్నాడు తృప్తిగా.

సన్నగా చినుకులు మొదలైనాయి. ఆరుబయటవున్న నులక మంచాన్ని వసారాలోకి లాక్కుని కూచున్నాడు ఓబులేశు. అదే సమయంలో ఇంటి ముందు నుంచి, జగన్నాథం సంతులు గబగబా పోతూ కన్పించాడు. 'వానొస్తున్నది సారూ, కొంచేపు కూసుని పోదూరు' అని ఆహ్వానించాడు ఓబులేశు. పంతులు స్వతంత్రంగా లోపలికొచ్చి వసారాలో మంచం మీద కూర్చున్నాడు. శేషమ్మ ఇంట్లోంచి వచ్చి, పంతుల్ను పలకరించి మళ్ళీ లోపలికి పోయింది.

'బాగున్నావా ఓబులేశూ, వీరభద్రం బాగున్నాడా' అని కుశల ప్రశ్న వేశాడు పంతులు. 'ఏదో మీదయ సారూ, బాగానే వుండాం' అన్నాడు ఓబులేశు.

'అసలు నువ్వే గదసారూ, వాడి కింత అచ్చరమ్ముక్క జెప్పింది. నువ్వంటే వీరబద్రానికి మా గొప్ప ఇశ్వాసం ఎప్పుడూ నిన్ను గురించే అడుగుతుంటడు' అంది శేషమ్మ ఇంట్లో నుంచే.

'నాదేముందిలే శేషమ్మా. మీ వాడు చురుకైనవాడు. ఏం జెప్పినా బీరతీగమాదిరి అల్లుకుపొయ్యేవాడు. వాడు గొప్పోడౌతాడని ఎన్ని సార్లు జెప్పలేదు నేను' అన్నాడు పంతులు.

'కాసిని కాపీ తాగుసారూ' అని గ్లాసుతో కాఫీ తెచ్చిచ్చింది శేషమ్మ 'ఇప్పుడివ్వన్నీ ఎందుకమ్మా, వేళగానివేళ' అని కాఫీ గ్లాసు అందుకొని, కాఫీ ఓగుటకేసి 'వీరభద్రం నుంచి జాబులొస్తున్నయా' అని అడిగాడు.

'పదేను రోజులైంది. మళ్ళా రాలా' అన్నాడు ఓబులేశు.

పిల్లగాణ్ణి పెద్ద చదువులో చేరిస్తివి. కష్టమో సుఖమో డబ్బుకోసం పాలుమాలొద్దు. నీకొడుకు పెద్ద డాక్టరయితే నీ కష్టాలన్నీ తీరిపోతాయి' అన్నాడు పంతులు.

'అంతా నీ నోటి చలవ సారూ' అన్నారు దంపతులు

× × ×

ఒబులేశు శేషమ్మలకు వీరభద్రం ఒక్కడే కొడుకు. ఓబులేశుకు ఆపల్లెలో ఓ ఎకరం మాగాణీ వుంది. ఓ గేదె పాడి కూడా వున్నది. వీరభద్రం పదోతరగతిలో స్కూలు ఫస్టొచ్చాడు. ఆ పల్లెలో చదువుకాగానే పక్కపట్నంలో ఇంటర్లో చేరి మంచి మార్కులతో పాసయినాడు. ఎంట్రన్సు పరీక్షలో కూడా మంచి రేంకు సాధించి యం.బి. బి.యస్. చవడానికి అర్హత సాధించాడు వీరభద్రం.

'అవ్వన్నీ గొప్పోళ్ళ చదువులు. ఎంతో డబ్బు కావాల. మనం తూగగలమా' అన్నాడు ఓబులేశు. కానీ జగన్నాథం పంతులు ఒత్తిడితో, ఎలాగైతేనేం కొడుకును హైదరాబాదులో డాక్టరు కోర్సులో చేర్చాడు.హాస్టల్‌లోవుండి చదువుతున్నాడు వీరభద్రం. రెండునెలలు గడిచిపోయాయి.

× × ×

ఒకరోజు సాయంత్రం పొలంనుండి వచ్చి మంచంమీద కూర్చుని, భార్యతో 'ఈ ఏడు పంట దిగుబడి బాగానే వుండొచ్చు. కాసినన్నా అప్పులు తీర్చొచ్చు అన్నాడు ఓబులేశు.

'పేద పిసుక్కునే టోళ్ళం. మనోడు డాక్టరు

చదవడం మన అదురుష్టం. ఇట్టాంటప్పుడు డబ్బులు వెనకాముందూ చూసుకుంటే ఎట్టా? అప్పులు వాడే తీర్చుకుంటాడు' అంది శేషమ్మ.

తమ కొడుకు తెల్లకోటువేసుకొని,మెళ్లో స్టెతస్కోపు వేసుకొని, బూట్లు టకటకలాడించుకుంటూ, ఆస్పత్రిలో తిరుగుతున్నట్లూ, రోగుల బంధువులు అతనికి కృతజ్ఞతతో నమస్కరిస్తున్నట్లూ, బాగా డబ్బు సంపాదించి అప్పులన్నిట్నీ తీరుస్తున్నట్లూ- ఊహించుకుంటూ ఆనందంలో తేలిపోతున్నారు.

ఇంతలో ఉన్నట్టుండి జగన్నాధం పంతులూ, మరిద్దరుయువకులూ- చిన్నగా వీరభద్రాన్ని నడిపించుకుంటూ వచ్చారు. వారిని చూడగానే ఓబులేశు దంపతులకు పై ప్రాణాలు పైనే పోయినాయి. ఆత్రుతతో లేచి కొడుకు దగ్గరకు పోయారు. వీరభద్రం పిచ్చిచూపులు చూస్తూ ఏ లోకంలోనో వున్నాడు! ఏదో పెద్ద షాక్‌కు గురైనట్లు కనిపించాడు. శరీరం చాలా బలహీనంగావుండి, పీక్కుపోయినట్లున్నాడు. ఓబులేశు కొడుకును పొదువుకొని, జగన్నాధం వైపు చూసి 'ఏంది సారూ, ఏమయింది' అని భయంగా అడిగాడు. ఏమి జరిగిందో తెలియక శేషమ్మ ఏడుపు మొదలుపెట్టింది.

పంతులు వచ్చిన యువకుల సాయంతో, నెమ్మదిగా వీరభద్రాన్ని మంచం మీద పడుకోబెట్టి ఇది ర్యాగింగ్ ఫలితం' అన్నాడు.

'ర్యాగింగా, అంటే ఏంది' అని అడిగారు దంపతులు.

'కొత్తగా కాలేజీలో చేరిన పిల్లలను, అంతకు ముందు రెండు మూడేండ్లుగా చదువుతున్న సీనియర్లు కొన్నిరోజులపాటు వేళాకోళం పట్టిస్తుంటారు. ఆ వేళాకోళం శ్రుతిమించి, వెర్రితలలువేసి- జూనియర్లను హింసించడం, అవమానపరచడం, బట్టలూడదీయించడం, బూతుపనులూ, రోత పనులూ చేయించడం లాంటివి చేస్తారు కొందరు ధూర్తులైన సీనియర్లు. కొందరు ఓర్చుకుంటారు గాని వీరభద్రం లాంటి సున్నిత మనస్కులు, ఇలా షాక్ అవుతారు. ఎన్ని చట్టాలు చేసినా, ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా ఈ భూతం పోవడంలేదు. చదువుకునే పిల్లలకు ఈ శాడిస్టు వినోదం ఏమిటో అర్థంకాదు.' అని నిట్టూర్చాడు పంతులు.

ఎంతో ఆశతో, గొప్పడాక్టర్లై తిరిగొస్తాడనుకున్న కొడుకు మూడునెలలు కూడా తిరక్కుండానే ఈ స్థితిలో ఇంటికి రావడం చూసి కుప్పకూలి పోయినారు ఆపేద దంపతులు.

## ☺ హాస్య చినుకులు ☺

"హౌస్ ఫుల్లూ-కలెక్షన్ నిల్లూ' అంటే ఇప్పుడు అర్థమయిందిరా"

ఎలా?

"మాషాప్‌లో ఇద్దరు అందమైన సేల్స్‌గరల్స్‌ని పెట్టాను. వాళ్ళనుచూడడం కోసం జనం వచ్చి గంటల తరబడి సరుకు చూసి వెళ్తున్నారు కాని కొనటం మాత్రం లేదు!

☺ ☺ ☺

'ఈ రెండు రోజులలో చాలా మందికి ఆపరేషన్లు చేయడానికి కారణం ఏమిటి? డాక్టరుని అడిగాడు ఓ పేషంటు

'శవాల గదిలోని వారందరిని తగలబెట్టేయడమే.....? అసలువిషయం చల్లగా చెప్పాడు డాక్టర్

☺ ☺ ☺

'ప్రియా నన్ను మోసం చేయవు కదూ! అడిగింది విమల.

'నిన్నెందుకు మోసం చేస్తాను? చేస్తే లత, శైలజలను మోసం చేస్తానుకాని' చెప్పి నాలుక కరుచుకున్నాడు రవి.

☺ ☺ ☺

'మన బాసు ఇవాళనెత్తిమీదటోపీ పెట్టుకొచ్చాడేమిటి?' అడిగాడు వర్మ.

'ఆయన భార్య అప్పడాల కర్రతో నెత్తిమీద కొట్టుంటుంది.

ఆ బొప్పికనపడకుండా వుండటంకోసం కాబోలు,...'చెప్పాడు శర్మ.

☺ ☺ ☺

'పేషెంటు పరిస్థితి మెరుగయ్యింది కాని పేరెంట్సు పరిస్థితే లీకయ్యింది!'

'కారణం?'

'డాక్టరుగారిబిల్లు ఇల్లమ్మికట్టడమే!'

☺ ☺ ☺

'మీ ఇంట్లో షుగరుంటే ఓగ్లాసుడు అప్పివ్వు వదినా?' అడిగింది కమల.

'మా ఇంట్లో లేదు, ఒంట్లో మాత్రం, నీకు కావాల్సినంత ఫ్రీగా తీసుకెళ్ళు' అంది విమల.

☺ ☺ ☺

'ఆ గిరిగాడు వికలాంగుడయిపోయాడు!'

'అరెరె.... ఎంత పనిజరిగింది, ఇంతకీ నీవా విషయం ఎలా తెల్సుకున్నావ్'

మొన్న బస్సులో వికలాంగులకి కేటాయించిన సీట్‌లో కూర్చునుంటే కనిపెట్టానులే-

☺ ☺ ☺

'మీరు వ్రాసే తెలుగు నవల్స్‌లో అలా పేరాలు పేరాలుగా ఇంగ్లీష్ పదాలుంటాయి. కారణం?' రచయితని అడిగాడో పాఠకుడు.

'ఒక్కోసారి ఇంగ్లీష్ నవల్స్ కాపీ చేసేటప్పుడు కొన్ని మాటలు అలా యధాలాపంగా జారిపోతుంటాయి' చెప్పి నాలుక కరుచుకున్నాడు రచయిత.

- వై.కె.మూర్తి